క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న జస్టిస్ నాగార్జునరెడ్డి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ నాగార్జునరెడ్డి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శనివారం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమీషన్ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

కోడి పందాల స్థావరంపై దాడి

పరవాడ: వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం గ్రామంలో రాములవారి తీర్థ మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై పరవాడ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడి పందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 4 కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు. స్వాధీనం చేసుకున్న కోడి పుంజులను సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.

సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన

గాజువాక: సైబర్ సెక్యూరిటీపై గాజువాక క్రైం పోలీసులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు జరిగే విధానం, వాటినుంచి రక్షించుకొనే పద్ధతులకు సంబంధించిన పలు అంశాలను స్థానిక టీఏస్సార్ టీబీకే డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాజువాక క్రైం సీఐ పి.సూర్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల కరస్పాండెంట్ టి.మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు ఫకీర్ తక్యాలో జరుగుతున్న తార్డు రోడ్డు నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు శనివారం పరిశీలించారు. ఇటీవల రోడ్డు పాడవడంతో సుబ్బారావు ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో, జీవీఎంసీ నిధులతో రోడ్డు నిర్మాణానికి నిధులను సమకూర్చారు. ఆ పనులు ప్రారంభం కావడంతో ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు వి.పరశురాముడు, సీహెచ్.శ్రీనివాసరావు, యోహాను పాల్గొన్నారు.

ఓటర్లే ప్రజాస్వామ్యానికి పునాది

అగనంపూడి: ఓటర్ల చైతన్యంతోనే ప్రజాస్వామ్యం బలపడుతుందని ఓటర్స్ ఫోరం ఫర్ బెటర్ డెమోక్రసీ జాతీయ అధ్యక్షుడు నూకల సూర్యప్రకాష్ అన్నారు. అగనంపూడి కూడలిలో శనివారం ఉదయం జాతీయ ఓటర్ల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు ప్రాధాన్యాన్ని గుర్తించేలా చేయడమే సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షుడు నెల్లి శ్రీనివాసరావు, అఖిలపక్షాల నాయకులు పాల్గొన్నారు.

సోము వీర్రాజు ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న సోము వీర్రాజు, మాధవ్ తదితరులు

గాజువాక: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు గాజువాకలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ 70వ వార్డులో ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులైన ఓటర్లను కలుసుకున్నారు. డ్రైవర్స్ కాలనీలోని ట్వింకిల్ స్కూల్ కరస్పాండెంట్‌ను కలిసి ఓటును అభ్యర్థించారు. అనంతరం పాతకర్ణవానిపాలెంలోని బీజేపీ గాజువాక కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 15 బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, వారికి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవల కోసమే కన్వీనర్ల నియామకం

- అర్హులకు పథకాలు దూరం కాకూడదు
- అదే సీఎం జగన్ లక్ష్యం
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ మరింత చేరువ చేసేందుకే ప్రతి సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ తరఫున కన్వీనర్లను నియమించినట్లు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 96వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చారన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనేదే ఆయన లక్ష్యమన్నారు. దానికి అనుగుణంగా ప్రతి సచివాలయం పరిధిలో పార్టీ తరఫున కన్వీనర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. నియమింపబడే వారంతా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 96వ వార్డు పరిధికి సంబంధించి పది సచివాలయాల పరిధిలో 30 మంది కన్వీనర్లను నియమించామని.. వారి జాబితాను అధిష్టానానికి పంపించినట్టు తెలిపారు. కన్వీనర్లందరూ ప్రజల్లో ఉండి వారి సమస్యలను తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా కన్వీనర్ల సేవలను వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో 96వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి రమణచిట్టి, దాడి ఉమామహేశ్వరరావు, గొర్లె రామునాయుడు, శరగడం నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ఉగాది నాటికి జగనన్న కాలనీలు పూర్తి కావాలి

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు
- ముదపాకలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ముదపాకలో జగనన్న కాలనీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

సింహాచలం : రానున్న ఉగాది నాటికి జగనన్న కాలనీల నిర్మాణాలు పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పెందుర్తి మండలంలోని ముదబాకలో నిర్మిస్తున్న జగనన్న కాలనీని జేసీ విశ్వనాథంతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇస్తుందన్నారు. అందులో భాగంగా ముదపాకలో ఫేజ్–1లో 270 ఎకరాలు, ఫేజ్–2లో 50 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 6028 ఇళ్లు మంజూరు కాగా లబ్ధిదారులు స్వచ్ఛందగా వచ్చి 5080 ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. అలాగే 2653 మంది ఎస్‌హెచ్‌జీ ద్వారా లోన్లు పొందారన్నారు. ప్రస్తుతం ఫేజ్–1,2ల్లో కలిపి 330 ఇళ్ల పునాదులు పూర్తయ్యాయని, మిగిలిన వాటికి సంబంధించి పనులు మొదులు పెట్టి రానున్న ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన జరిపాలని తెలిపారు. కాంట్రాక్టర్లకు అవసరమయ్యే విద్యుత్, మంచినీరు, నీటి పంపులు, వాచ్‌మేన్ గది లాంటి సౌకర్యాలు కల్పించాలని హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి వారం పనుల పరిశీలన, రిజిస్టర్ల తనిఖీ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, రెవెన్యూ డీసీ ఫణిరాం, ఎనిమిదో జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, హౌసింగ్ ఈఈ ఆర్‌పీ రాజు, ఏఈ దీపక్, కార్యదర్శులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



బోదువలసలో గడపగడపకు కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: ప్రజా సమస్యలను గుర్తించి సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. మండలంలోని బోదువలస గ్రామంలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారులతో వెళ్లి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అందించిన పలు సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పథకాన్ని అమలు చేస్తూ గడపగడపకూ రూ. లక్షల్లో లబ్ధి చేకూర్చిందన్నారు. గ్రామంలోని అన్ని సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన జగ్రిపోతుల సముద్రాలమ్మకు సొంత నిధులతో వీల్‌చైర్ అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, ఎంపీడీవో రమేష్ నాయుడు, పార్టీ స్థానిక నాయకులు కోన సంజీవ్, ఉగ్గిన గంగునాయుడు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఐడీ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఎంపీడీవో రమేష్ నాయుడు సమీక్షించారు. గ్రామానికి చెందిన సమగ్ర సమాచారంపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులే ధరించాలన్నారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమాచారాన్ని ఎమ్మెల్యేకు వివరించి.. సమస్యలు నమోదు చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో హాజరు కాకపోవడంపై ఆయన ఆరా తీశారు. హాజరు కాలేనప్పుడు సమాచారం కూడా ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు శ్రావణ్, శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి నుంచి శ్యామా నవరాత్రులు



శ్యామా నవరాత్రులకు ముస్తాబవుతున్న రాజశ్యామలదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో ఈ నెల 22 నుండి 30వ తేదీ వరకూ శ్యామా నవరాత్రులు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా రాజ శ్యామలదేవి అమ్మవారి సన్నిధిలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి అన్నపూర్ణమ్మ తెలిపారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజు అభిషేకం, 16 రకాల ఉపచార పూజలు, శ్యామా యంత్రపూజ, రాజశ్యామల హోమం, హారతి, ప్రసాదం సమర్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ నెల 22న రాజ శ్యామల హోమం, 26న వాగ్దేవి హోమం, 29న సిరిజ్యోతి పూజ, 30న శ్యామా సహస్రనామార్చన వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీటితో పాటు ప్రతిరోజు అమ్మవారి అలంకార సేవ, నైవేద్యం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

వంతెనపై రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి



ముత్యాలమ్మపాలెం వంతెనపై దెబ్బతిన్న రక్షణ గోడలు

పరవాడ: వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో నిర్మించిన వంతెనకు ఇరువైపుల ఏర్పాటు చేసిన రక్షణ గోడలు దెబ్బతినడంతో ప్రమాదాలకు నిలయంగామారింది. వంతెన నిర్మాణం చేపట్టి చాలా కాలం గడుస్తున్నప్పటికీ కనీస మరమ్మతులు చేపట్టలేదు. గత ఏడాదిలో చేపట్టిన రోడ్డు విస్తరణలో పాత వంతెనను తొలగించి నూతన వంతెన ఏర్పాటు చేయాలి. కానీ అలా జరగపోగా పాత వంతెనకు కనీస మరమ్మతులు కూడా చేయకుండా రోడ్డు విస్తరణ చేసి చేతులు దులుపుకున్నారు. ఫలితంగా పాత వంతెనకు ఇరువైపుల ఇనుపరాడ్లతో నిర్మించిన రెయిలింగ్ తుప్పు పట్టి రాలిపోవడంతో వంతెనపై ప్రయాణానికి భద్రత లేకుండా పోయింది. రాత్రి సమయంలో వాహనాలపై రాకపోకలు సాగిస్తున్న వారు వంతెనపై రక్షణ గోడలు లేక ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో వంతెన వద్ద పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా వంతెనకు మరమ్మతులు చేపట్టి.. రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెదగంట్యాడ: విద్యార్థులు ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు సూచించారు. పెదగంట్యాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్కూల్ హెల్త్ స్క్రీనింగ్‌లో భాగంగా నెల్లిముక్కు ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ, ఏఎన్ఎం సీహెచ్ శిరీష, ఎస్.జయ, హెచ్ఎం ఎస్‌వీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

28న అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ

అగనంపూడి: పెదమడక గ్రామంలోని సూది కొండపై కొలువుదీరిన శ్రీమాతా దుర్గా భవాని అమ్మవారి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీ కల్యాణ లక్ష్మి, శ్రీ సంతాన లక్ష్మి, శ్రీ నూకాలమ్మ వార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 28వ తేదీన చేపట్టనున్నట్టు ఆలయ ధర్మకర్త బళ్ల పైడిరాజు తెలిపారు. ఉత్సవ కరపత్రాలను ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. 31న ఆలయ మూడో వార్షికోత్సవం నిర్వహిస్తామని, మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. నాయకులు ఇల్లపు ప్రసాద్, జి.పూర్ణానందశర్మ , నక్కా రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

భద్రతతో రోడ్డు ప్రమాదాల నివారణ



ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

సబ్బవరం: వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని సీఐ రంగనాథం తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక సీతారామ కళ్యాణ మండంలో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ.. సురక్షిత ప్రయాణాలు చేయాల్సిన బాధ్యత మనదే అన్నారు. ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ నెల 18 నుండి 24వ తేదీ వరకూ ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎల్. సురేష్, వివేకానంధా స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస వర్మ, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో సురక్షిత ప్రయాణం



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న సీఐ ఈశ్వరరావు

పరవాడ: రహదారులపై రాకపోకలు సాగించే సమయంలో వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి బయట పడవచ్చునని పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు సూచించారు. ట్రాఫిక్ వారోత్సవాల్లో భాగంగా ఫార్మాసిటీ లారస్ ల్యాబ్స్ యూనిట్–3లో శనివారం కార్మికులకు ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలపై ప్రయాణించే వారు విధిగా హెల్మెట్ ధరించడంతో పాటు కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించడం సురక్షితం అన్నారు. ప్రజలు, ప్రయాణికులు రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తూ ప్రమాద రహిత అనకాపల్లికి కృషి చేయాలని సీఐ ఈశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో లారస్ ల్యాబ్ ప్రతినిధులు రామకృష్ణ, పరవాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ముస్లిం చాంపియన్ ట్రోఫీ విజేత దేవాడ జట్టు



అక్కిరెడ్డిపాలెం: మర్రిపాలేనికి చెందిన మస్జీద్ అల్–ఫాతా ఎం.ఎం.ఎం.డబ్ల్యూఏ ఆధ్వర్యంలో బీహెచ్ఈఎల్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి ముస్లిం చాంపియన్ ట్రోఫీ క్రికెట్ పోటీలను నిర్వహించారు. మస్జీద్– అల్–ఫాతా ప్రతినిధి సోదరుడు ఖాజా జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీల్లో 26 ముస్లిం టీంలు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్స్‌లో యాసీన్ బాబా జట్టుపై దేవాడ జట్టు విజయం సాధించింది. తృతీయ స్థానంలో చిన్నపాలెం జట్టు నిలిచింది. విజేత జట్లకు నిర్వాహకులు ట్రోఫీ అందజేశారు.

బయోమెట్రిక్ హాజరుపై కార్మికుల నిరసన

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో నూతనంగా ప్రవేశపెట్టిన పంచింగ్ (బయోమెట్రిక్) విధానాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన గేటు వద్ద శనివారం నల్ల జెండాలతో నిరసన తెలిపారు. సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ యాజమాన్యం ప్రవేశపెట్టిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిటూ నాయకులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐలోని డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ మోటార్ వెహికల్, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ లండ సుధాకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలని, వయసు 18 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు ఎల్ఎల్ ఆర్ కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

25 నుంచి ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

పెదగంట్యాడ: వుడా కాలనీలోని పద్మావతి ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం తెలిపారు. 26న అమ్మవారికి సారె సమర్పణ, 27న శ్రీవారి కల్యాణం, 28న లక్ష్మీనరసింహ యాగం, స్వామి వారి రథయాత్ర, 29న పరస ఉంటాయన్నారు. 30న అన్నకూటోత్సవం , పుష్పయాగం, ఊంజల్ సేవ చేయనున్నామని తెలిపారు.

నవ్య ఆవిష్కరణల వేదిక 'ఎక్స్‌పో'

- ఆసక్తిగా తిలకించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు
- ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో–2023కి విశేష స్పందన



ఆర్గానిక్ ఉత్పత్తుల తయారీ విధానాన్ని తెలుసుకుంటున్న ఎంఎస్ఎంఈ డీసీ చంద్రశేఖర్



ఎక్స్‌పోలో సందర్శకుల సందడి

అక్కిరెడ్డిపాలెం: విభిన్న ఆలోచనలు, నవ్య ఆవిష్కరణల వేదికగా నిలిచింది ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో–2023. ఆటోనగర్ వాసీవా భవనం వద్ద మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ), విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌పోకు విశేష స్పందన లభించింది. పారిశ్రామిక ఉత్పత్తులు, బ్యాంకులకు సంబంధించి ఏర్పాటు చేసిన 70 స్టాల్స్‌ను సందర్శించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పరిశ్రమలకు కావల్సిన మెషినరీ, ఆర్గానిక్‌ఉత్పత్తులు, లెదర్, నిర్మాణరంగానికి సంబంధించిన కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించి, ఉత్పత్తుల వివరాల గురించి వారిని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ ఎక్స్‌పోను సందర్శించారు. విజ్ఞాన్, గొన్నా ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులతో పాటు ఎంబీఏ విద్యార్థులు కూడా వచ్చి, ఆసక్తిగా తిలకించారు.

ఎంఎస్ఎంఈ ఇన్‌చార్జి ఏడీ జి.వి.ఆర్.నాయుడు, వాసీవా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.కె.బాలాజీ, డి.వినోద్‌ల నేతృత్వంలో జరిగిన ఎక్స్ పోలో వాసీవా కార్యదర్శి ఇ.కృష్ణ ప్రసాద్, వై.సాంబశివరావు, చీకటి సత్యనారాయణ, పి.ప్రభాకర్, పాండురంగ ప్రసాద్, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇలాంటి ఎక్స్‌పోలు మరిన్ని ఏర్పాటు చేయాలి

ఎక్స్ పోలో స్టాల్స్ వినూత్న ఆలోచనలకు బలం చేకూర్చే లా ఉన్నాయి. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చాలా నచ్చింది. విద్యుత్ ఉత్పత్తిలో ఎన్నో ప్రయోగాలు చేసి చూపించడం బాగుంది. ఇలాంటి ఎక్స్ పోలు ఎక్కువగా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

–లక్ష్మీ నాగ్, ఎంబీఏ స్టూడెంట్, నోబెల్ఇన్‌స్టిట్యూట్

పారిశ్రామిక వేత్తలకు మేలు



ఎక్స్‌పోతో ఆటోనగర్ పారిశ్రామిక వేత్తలకు మేలు జరుగుతుంది. పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, బ్యాంకుల్లో రుణసదుపాయాలు తదితర అంశాలన్నీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగపడతాయి. ఎక్స్‌పో విజయవంతానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.

– జి.వి.ఆర్.నాయుడు, ఇన్‌చార్జి ఏడీ ఎంఎస్ఎంఈ.

పరిశ్రమల స్థాపనకు ఉపయోగం



ఆటోనగర్‌లో నిర్వహించిన ఎక్స్ పోలో పలు ప్రభుత్వ, ప్రైవే ట్ సంస్థలు పాల్గొన్నాయి. పరిశ్రమల స్థాపనకు అవసరమైన విషయాలను తెలుసుకునేందుకు ఈ ఎక్స్‌పో ఎంతో ఉపయోగకరం. ఎక్స్‌పో సక్సెస్ కావడం ఆనందంగా ఉంది.

– ఏ.కె.బాలాజీ, డి.వినోద్, వాసీవా అధ్యక్ష, కార్యదర్శులు